క్లుప్తంగా

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన సింగపురం ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేను, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కృషిని వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ బయోడేటాను వారికి అందించారు.

సీఎంను కలిసిన డీసీసీబీ వైస్ చైర్మన్



కొడకండ్ల: సీఎం రేవంత్‌రెడ్డిని మండలకేంద్రానికి చెందిన డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత సీఎంను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు.

ప్రొడక్షన్ స్టాల్ ప్రారంభం



స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ రైల్వేలను ఆధునీకరించడంలో భాగంగా ప్రయాణికులకు మెరుగైన వసతులను కల్పించేందుకు గాను దేశ వ్యాప్తంగా వన్ స్టేషన్, వన్ ప్రొడక్షన్ స్టాల్ ప్రారంభోత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించగా స్థానిక రైల్వేస్టేషన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యం కోసం మరిన్ని సౌకర్యాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏడీఈఈ, ఈఎల్‌ఎస్ ఎస్.ఫణికుమార్, చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్.శ్రావణ్‌కుమార్, వీరకుమార్, సురేష్‌కుమార్, మల్లికార్జున్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



జనగామ: జనగామ ఆర్యవైశ్య ప్రముఖులు, చాంబర్ గౌరవ అధ్యక్షుడు పజ్జూరిగోపయ్య సతీమణి లక్ష్మి ఇటీవల మృతి చెందింది. కాగా, మంగళవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర యువజన విభాగం కోశాధికారి నరేష్ గుప్తా, యువజన విభాగం రాష్ట్ర నాయకులు భువనగిరి శ్రీధర్ పలువురు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఇంకెప్పుడు..?



జనగామ: జనగామ నుంచి హైదరాబాద్ రూట్ ఏకశిల బీఈడీ కళాశాల ఆవరణ నుంచి పెంబర్తి బైపాస్ వరకు రోడ్డు విస్తరణ అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం చేయడంతో.. సింగిల్ రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రోడ్డు ముందు బస్సు లేదా మరో వాహనం వెళ్లే క్రమంలో, వెనకాల వచ్చే వెహికిల్స్ కిలోమీటరు వరకు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. కాగా, ఇరుకైన రోడ్డు మూలంగా రాత్రి సమయంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఇదే రోడ్డుపై ఇద్దరు యువకులు మృతిచెందిన సంగతి తెలిసిందే. రోడ్డు విస్తరణ పూర్తి చేసి, డబుల్ దారులు వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

బ్రిక్స్ తయారీ కేంద్రంలో సామగ్రి చోరీ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని స్వరూప సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రంలో నాలుగు రోజుల క్రితం రూ. 1.20 లక్షల విలువైన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. బాధితుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ పోషణ కోసం అప్పులు తెచ్చి బ్రిక్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. రోజూ సిమెంట్ బ్రిక్‌లు తయారు చేసి వర్కర్లతో కలిసి ఇంటికి వెళ్లేవాడు. కాగా, శనివారం బ్రిక్స్ తయారు చేసేందుకు ఉపయోగించే మోటార్లు, బోర్ మోటార్, సర్వీసు వైర్లు కనిపించకపోవడంతో దుండగులు ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. దీంతో రూ.1.20 లక్ష నష్టం వాటిల్లిందని తెలిపాడు. ఎస్సై ముత్యం రాజేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుపరిపాలన



తరిగొప్పుల: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



నర్మెట: మచ్చుపహాడ్‌లో..



బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్లలో..

తరిగొప్పుల/నర్మెట/బచ్చన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుపరిపాలన అందుతుందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన 90 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించాయి. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వగలబోయిన యాదగిరి, గంగం నర్సింహారెడ్డి, పండుగ కనుకయ్య, బృంగి శివకుమార్, మహ్మద్ యాకూబ్, చిలువేరు సంపత్, ఫరీదుల యాదయ్య, రాజు గౌడ్, భవాని, రాంచందర్, యాదగిరి, కర్ణాకర్‌రెడ్డి, బాపురెడ్డి, రాంరెడ్డి, బాబు, అయిలుమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న దయాకర్‌రావు

కొడకండ్ల: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ముందుకు సాగి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో దయాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. పార్టీకి మండల, గ్రామ కమిటీలే సుప్రీం అని, ఇతర పార్టీలు బీఆర్‌ఎస్‌పై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ బెదిరింపు రాజకీయాలకు భయపడకుండా ఎదురొడ్డి నిలువాలని కోరారు. మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



తహసీల్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా సత్వర చర్యలు చేపట్టాలని జనగామ ఆర్డీఓ కొమురయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణిలో నెలకొన్న పెండింగ్ భూ సమస్యలు, భూమి కొలతల విషయంలో సర్వేయర్‌ల పనితీరుపై ఆరా తీశారు. తహసీల్దార్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ నవీన్ కుమార్, ఆర్‌ఐలు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభకు తరలిన నాయకులు



జనగామ: జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



దేవరుప్పల నుంచి తరలివెళ్తున్న నాయకులు

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జఫర్‌గఢ్/దేవరుప్పుల: హైదరాబాద్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభ బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి మంగళవారం జనగామ నుంచి పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలి వెళ్లగా, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి జెండా పూరి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 15 వందల బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు వెళ్లినట్లు తెలిపారు. దేశంలో మూడో సారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా గెలిపించుకోవాలని కోట్లాది మంది ప్రజలు ఎలక్షన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యకర్తలు కంకణ బద్ధులై పని చేసి, పార్టీ విజయంలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. చిల్పూరు నుంచి గంటె ఉపేందర్‌యాదవ్, తోకల సంపత్‌రెడ్డి, రజనీకర్, శ్రీనివాస్, సాదం బీమన్న, రాజు, రామరాజు, వేణు, నామాల రాహుల్, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అయిలోని అంజిరెడ్డి, గట్టు వెంకటరమణ ఉన్నారు. జఫర్‌గఢ్ నుంచి కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, మదన్‌మోహన్, ఎండి వలిపాష, గాదెపాక శ్రీను, మేర్గు రామరాజు, దేవరుప్పుల నుంచి జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్, కాసాని సత్తయ్య, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ప్రింటర్ వితరణ



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల కెనరా బ్యాంకు మేనేజర్ సోని ఆధ్వర్యంలో మంగళవారం నవాబుపేట కోదండ రామస్వామి ఆలయానికి ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా రూ.13వేల విలువైన ప్రింటర్‌ను అందజేశారు. కోదండ రామస్వామి దేవాలయ సిబ్బంది మోహన్, ఆలయ పూజారులు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు అలింపూర్, గంగాపూర్, తమ్మడపల్లిల్లో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం విద్యుత్ జీరో బిల్లులను లబ్ధిదారులకు అందించిన ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను రేవంతరెడ్డి ప్రభుత్వం వంద శాతం అమలు చేస్తుందని, ప్రజలు ఏమాత్రం ఆందోళన చెందొద్దన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొడ్వటూర్ దేవస్థానం చైర్మన్ గాలి కృష్ణ, మండల పార్టీ ఇంచార్జి నూకల బాల్ రెడ్డి, ఎంపీటీసీ మసూద్, మాజీ సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, వేముల వెంకట్, నాయకులు వేణు, వందన, దయాకర్‌రెడ్డి, విశ్వనాథ్, ఆల్వాల ఎల్లయ్య, మేకల రాజు, వీరారెడ్డి, రమేష్, మహాత్మా చారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలతో ఆదర్శంగా నిలవాలి



కొడకండ్ల: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించి ఆదర్శంగా నిలవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని టీఎస్‌ఆర్‌ఎస్, కస్తూరాబా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు హనుమాండ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్ల శ్రీరాములు బహూకరించిన పరీక్ష ప్యాడ్‌లను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కొడకండ్ల: హక్యాతండాకు చెందిన నాను అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరగా వైద్య సాయం నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేయించి ఎల్‌ఓసీని మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి అందజేశారు.

వెంకటరమణ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కవులు

జనగామ రూరల్: కవి, ఉపాధ్యాయుడు గుండు వెంకటరమణ మృతి కళారంగానికి తీరని లోటని కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అన్ని రంగాల్లో రాణించారని కొనియాడారు. నేటి తరం కవులకు ఆయన స్ఫూర్తిదాయమని అన్నారు. కవి లగిశెట్టి ప్రభాకర్ ఆయన పై కవితను రాసి ఆలపించారు. కార్యక్రమంలో కవులు పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, వేముల సదానందం, చాపల మహేందర్, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

'రాజకీయ ఉనికి కోసం బీఆర్‌ఎస్ ఆరాటం'

దేవరుప్పుల: రాజకీయ ఉనికి కోసం బీఆర్‌ఎస్ నాయకులు ఆరాటం చేస్తున్నారని తెలంగాణ ఉద్యమ నాయకులు, ఓయూజేఏసీ నేత ఇప్ప పృథ్వీరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాల్వలు, చెరువుల పునరుద్ధరణ చేశామన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క సంవత్సరం వర్షాలు సరిగ్గా పడకపోవడంతోనే బోర్లు, బావులు ఎలా ఎండిపోతాయో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. గత ఆరు నెలలుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ముందస్తు ఎండల తీవ్రతతో భూగర్భజాలలు అడుగంటితే కాంగ్రెస్ ప్రభుత్వంపై రాద్ధాంతం చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నవాబుపేట రిజర్వాయర్‌కు వచ్చే కాల్వపనుల మరమ్మతులో వైఫల్యంతోనే ప్రస్తుత నీటి ఎద్దడికి కారణమని, ఐనప్పటికీ సాగునీటిని అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రత్యామ్నయ చర్యలతో పాటుపడుతున్నా ప్రజలకు తప్పుడు సమాచారంతో మాజీ మంత్రి దయాకర్‌రావు సంకేతాలు ఇవ్వడం విచారకరమన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

బచ్చన్నపేట: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కేసిరెడ్డిపల్లి ఎంపీటీసీ కర్ణాల వేణుగోపాల్ అన్నారు. మంగళవారం గ్రామంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ ప్రారంభించి మాట్లాడారు. లేబర్ కార్డు కలిగిన 200 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారని తెలిపారు. వారికి అవసరమైన మందులను కూడా అందించామన్నారు. కార్యక్రమంలో సీసీ అప్రోజ్, సీఎస్‌సీ సిబ్బంది, నాయకులు కాపర్తి హరిప్రసాద్, గాలి తిరుపతి, బాల్నె శంకర్, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

చిల్పూరు: లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వ పనులను వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడేలా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ కోరారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చిల్పూరు మండల రైతుల పంటలు సాగునీరు లేక ఎండిపోయే దశకు చేరుకున్నాయని, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించి సాగునీరు అందించాలని కోరారు. సాదం పరమేష్, ఊరడి రవి, మల్లయ్య, భిక్షపతి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, 17 స్థానాలను కైవసం చేసుకోవాలని ఆ పార్టీ నాయకుడు జిల్లెల్ల దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గంగాపూర్‌లో ఇంటింటా వెళ్లి జీరో బిల్లును తీయించి లబ్ధిదారులకు అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రఘునాథపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను మంగళవారం అందజేశారు. జిల్లా చైర్మన్ మర్యాల యాదిరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, థెరీసా రెడ్డి, శ్రీకాంత్, ఉపేందర్గుప్త, లక్ష్మణ్, అనీల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటికొండలో..

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదివే విద్యార్థులకు జ్ఞానద ఫౌండేషన్, జ్ఞాన సరస్వతి పీఠం ఆధ్వర్యంలో మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ పవన్‌శర్మ పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలో మంగళవారం జిల్లా మాలమహానాడు-2024 క్యాలెండర్లను జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొల్లం (మణికంఠ) అజయ్ ఆవిష్కరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, ఎంపీపీ కందుల రేఖగట్టయ్యలు ఆవిష్కరించారు. నీలం యువరాజ్, ఎడ్ల బాస్కర్ పాల్గొన్నారు.

నియామకం

జఫర్‌గఢ్: వడ్డెగూడేనికి చెందిన మాజీ ఎంపీటీసీ తాటికాయల ఎల్లయ్యను మాదిగ రాజకీయ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ టి. చిరంజీవి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సంపత్ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు.

స్వయంపాలన దినోత్సవం

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/దేవరుప్పుల: జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జఫర్‌గఢ్ మండలంలోని కోనాయిచలం ప్రాథమికోన్నత పాఠశాలలో, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో, దేవరుప్పుల మండలంలోని అప్పిరెడ్డిపల్లె మండల పరిషత్ పాఠశాలలో, జనగామ మండలం యశ్వంతాపూర్, వెంకిర్యాల పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుగా పాఠాలు బోధించారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి



పాలకుర్తి టౌన్ రాస్తారోకో చేస్తున్న నాయకులు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఇర్రి రమణారెడ్డి

పాలకుర్తి టౌన్: భూగర్భ జలాలు అడుగంటి నీరు అందక ఎండిన రైతుల పంటలకు నష్టపరిహారం అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ముస్కు రాంబాబు, పాము శ్రీనివాస్, పసులాది శంకర్, మల్లేశ్, కర్నాకర్ రెడ్డి, బెల్లి సోమయ్య పాల్గొన్నారు.

'పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం'

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు భారీగా అడుగంటడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు, నాయకులు సకాలంలో స్పందించి గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, ఎంపీటీసీ కర్ణాల వేణుగోపాల్,మాజీ సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, షబ్బీర్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

జఫర్‌గఢ్: ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించి బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని మగ్దుంతండాలో ఎండిన పంట పొలాలను నాయకులు, కార్యకర్తలు మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఎండిన పంట పొలాలకు దేవాదుల కాల్వల ద్వారా సాగు నీరు అందించి ఆదుకోవాలన్నారు. ఇప్పటికే పొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. రైతులు బానోత్ లింగనాయక్, బానోత్ దేవానాయక్, బుచ్చన్ననాయక్, దుర్గాసింగ్, మోతిలాల్, స్వామినాయక్, టిక్యా, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సదస్సుకు తరలిన మహిళలు



జనగామ: తరలివెళ్తున్న మహిళలు

జనగామ/రఘునాథపల్లి/దేవరుప్పుల: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా నిర్వహించిన మహిళా శక్తి విధాన ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి 26 బస్సుల్లో 1,300 మంది మహిళా సంఘాల సభ్యులు తరలి వెళ్లారు. వాహనాలను కలెక్టరేట్ ఆవరణలో జెడ్పీ సీఈఓ అనిల్ జెండా ఊపి ప్రారంభించారు.

నేటినుంచి గ్రూప్-1 తరగతులు

జనగామ రూరల్: తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్) ఆధ్వర్యంలో ఇటీవల గ్రూప్-1 శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేటి నుంచి గ్రూప్-1 తరగతులు ప్రారంభం అవుతాయని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లా సంబంధించిన అభ్యర్థులు హనుమకొండలోని స్టడీ సర్కిల్‌లో నేరుగా ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

డీఎస్సీ పరీక్షకు..

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలకు నిర్వహించే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 0870-2571192, 040-2407118, 040 -277077920 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

చేపల వేట కాదు.. సాగునీటి కష్టాలు



రాళ్లను తొలగిస్తున్న రైతులు

లింగాలఘణపురం: ఎండుతున్న యాసంగి పంటలను కాపాడుకొనేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వ పనులు పూర్తి కావడంతో వస్తున్న నీటిని అటు రఘునాథపల్లి రైతులు, ఇటు లింగాలఘణపురం రైతులు వినియోగించుకొనేందుకు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘునాథపల్లి మండలం ఇబ్రాహీంపూర్ లక్ష్మీతండాకు వెళ్లే టన్నెల్ వద్ద నీరు ఎక్కువగా వెళ్లేందుకు అక్కడి రైతులు కాల్వకు అడ్డంగా రాళ్లు వేయగా లింగాలఘణపురం మండలంలోని నాగారం, లింగాలఘణపురం రైతులు ఆ రాళ్లను తొలగించేందుకు కష్టపడుతున్నారు. ఒకటి రెండు తడులతో పంట చేతికొచ్చే దశలో ఉన్న వరిని కాపాడుకొనేందుకు ఎవరికి వారుగా తిప్పలు పడుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పాలకుర్తి టౌన్: రౌడీషీటర్లుగా ముద్రపడిన నేరస్తులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లుగా ముద్రపడిన నేరస్తులు గ్రామాల్లో ఎలాంటి వివాదాల్లో తలదూర్చవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మెడం సాయిప్రసన్నకుమార్ పాల్గొన్నారు.